క్లుప్తంగా

నూకాలమ్మ అమ్మవారికి వెండిచీరకు విరాళం



అమ్మవారి వెండి చీరకు విరాళం అందజేస్తున్న దాతలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం 33వ వార్డులో నూకాలమ్మ అమ్మవారికి వెండి చీర తయారు చేయుటకు భీమవరం పట్టణం 33వ వార్డు, సిరియాల వారి వీధికి చెందిన జమ్ము తాతరావుగారు(తాతయ్య) శుక్రవారం 122 గ్రాములు(నూట ఇరవై రెండు గ్రాములు)వెండిని ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహా సభ్యులు రౌతు అప్పారావు, మెట్టా మురళీ కృష్ణ, కోశాధికారి తాళ్ళపూడి పరమేశ్వరరావు, కార్యదర్శి రౌతు హరిబాబు పాల్గొన్నారు.

14 నుంచి దుంపగడప రైల్వే గేటు మూసివేత



స్థానిక దుంపగడప రైల్వే గేటు

ఆకివీడు: ప్రతీ రోజూ వందలాది వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతున్న దుంపగడప రైల్వే గేటును ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాంచి రైల్వే లైన్ ఆధునికీకరణ అనంతరం పురాతన రైల్వే ట్రాక్‌లను తొలగించే పనుల్లో భాగంగా రైల్వే గేటును మూసివేస్తున్నట్లు చెప్పారు. గత నాలుగు రోజులుగా సిద్ధాపురం రైల్వే గేటును మూసివేసి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్త ట్రాక్ నిర్మాణంతో గూడ్స్ వ్యాగన్ల రైళ్ల రాకపోకలు పెరిగే అవకాశం ఉంది.

ముఖదారమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



ముఖదారమ్మకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున నిర్వహించే ముఖదారమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల చిన్నరాజా, దీప్తి దంపతుల ఆధ్వర్యంలో మహిళల కోలాటం, భజనలతో, సన్నాయి వాయిద్యాలతో మల్లె పందిరిలో పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వేడుకగా వీరభద్ర స్వామి ఆలయానికి శంకుస్థాపన



సిద్ధాంతంలో వీరభద్ర స్వామి ఆలయం శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో మావుళ్లమ్మవారి గుడి వద్ద భద్రకాళి సమేత వీరభద్ర స్వామి నూతన ఆలయం శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం ఆచంట వారి వీధి శ్రీకృష్ణదేవరాయ తెలగ కాపు సంఘం ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. పురాతనమైన వీరభద్ర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. ఆచంట రాము, శ్రీమతి నాగమణి దంపతులతో పూజ్యం దుర్గ సత్యనారాయణ మూర్తి బ్రహ్మత్వంతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పీఓ, ఏపీవోలు కీలకం

పెనుగొండ: ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గ పీఓ, ఏపీఓలు నిర్వహించే పాత్ర అత్యంత కీలకమని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పర్యాటక శాఖ రీజనల్ డైరక్టరు వి స్వామినాయుడు అన్నారు. శుక్రవారం ఆచంటలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం, ఇతర అనుబంధ పోలింగ్ యూనిట్ల పనితీరు, పంపిణీ, పోలింగ్ అనంతరం కేంద్రం నిర్వహించాల్సిన బాధ్యతలను వివరించారు. పవర్ పాయింట్ ద్వారా సమగ్ర సమాచారాన్ని వివరించారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది టీం వర్క్‌తో వ్యవహరించాలని సూచించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- గాంధీజీ కలలు సాకారం చేసిన సీఎం జగన్
- అన్ని గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



అయిభీమవరం గ్రామ సచివలయంలో సిబ్బంది సేవలందిస్తున్న దృశ్యం



మండలంలోని కోళ్ళపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం

ఆకివీడు: సచివాలయాలు గ్రామ ప్రజల సేవలకు పెన్నిధిగా నిలుస్తున్నాయి. గ్రామాల్లోనే ప్రభుత్వ పాలన జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి చిన్న పనికి కూడా పనులు మానుకుని మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే ధృవపత్రాలు, ఇతర సమస్యలు పరిష్కారమైపోతున్నాయి. మహాత్మా గాంధీజీ కన్న కలల్ని జగన్ మోహన్ రెడ్డి సాధికారం చేస్తున్నారని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని 72 గ్రామ సచివాలయాలలో 42 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం పూర్తి అయింది. ఆయా సచివాలయాల్లో సిబ్బంది సేవల్ని ప్రారంభించారు. మరో 30 సచివాలయ భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ప్రతి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీర్ అసిసెంట్, కార్యదర్శి, సర్వేయిర్, మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్, వెటర్నరీ, హార్టీకల్చర్, వ్యవసాయ సహాయకులు, ఎనర్జీ అసిస్టెంట్, ఏఎన్ఎం, వీఆర్వో సేవలందిస్తున్నారు. ఆయా సచివాలయాల్లో పట్టా భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం తాజాగే చేపట్టడంతో లబ్ధిదారులు అధిక సంఖ్యలో సచివాలయాలకు చేరుకుని పట్టా భూముల్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రీ సర్వే, ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ నంబర్) సేవలందిస్తున్నారు. సచివాలయాల వద్ద సంక్షేమ సమాచార బోర్డులు అందుబాటులో ఉంచుతున్నారు. లబ్ధిదారులు తమకు వచ్చే సంక్షేమ పథకం మంజూరు అయినదీ లేనిదీ బోర్డులో చూసుకునే అవకాశం ఉంది. సంక్షేమ పథకం పొందిన వారి వివరాల్ని కూడా బోర్డులో పొందుపరుస్తున్నారు. ఆధాయ ధ్రువీకరణపత్రాల్ని ప్రభుత్వం మరింత సులభతరం చేసి సచివాలయాల ద్వారా అందజేస్తుంది. వార్డు సచివాలయాల్లో ప్రభుత్వం 11 రకలా సేవల్ని ఉచితంగా అందజేస్తుంది. ప్రభుత్వం ప్రస్తుతం 740 సేవల్ని సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పందన ఫిర్యాదుల్ని కూడా సచివాలయాల్లో తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో పాలన, ప్రజల ముంగిట ప్రభుత్వం అనే నినాదంతో పారదర్శక సేవలందిస్తున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారు. కాలం, ధనం వృద్ధా కాకుండా ప్రభుత్వం తీసుకున్న సచివాలయం వ్యవస్థ తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని పలు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



భీమవరంలో ఎన్నికల కార్యాలయం ప్రారంభిస్తున్న, వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం రెండో పట్టణంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వాసు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో భీమవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గ్రంధి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల మాట్లాడుతూ భీమవరం రెండో పట్టణంలో ఎన్నికల కార్యాలయం ప్రారంభించడం సంతోషకరమని, ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్‌ను, ఎంపీగా తనను గెలిపించడానికి ఈ ప్రాంత ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, అభిరుచి రఘు, గోకరాజు రామం, గాదిరాజు సుబ్బరాజు, కోటిపల్లి బాబు, పేరిచర్ల విజయ నసింహరాజు, తోట భోగయ్య, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బాలాజీ, చల్లారావు, సునీల్ రవితేజ, సాగర్ తో పాటుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే వెనుకబడిన, అట్టడుగు వర్గాల అభివృద్ధి



దుంపగడప గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకివీడు: వెనుకబడిన, అట్టడుగు, పేద వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా గత 58 ఏళ్లగా సంక్షేమ పథకాల్ని అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించి పేదల అభివృద్ధికి తోడ్పడాలని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) విజ్ఞప్తి చేశారు. మండలంలోని దుంపగడప శివారు పల్లెపాలెంలో శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకున్నారని తెలిపారు. చేపల వేట విశ్రాంతి సమయంలో వారి అవసరాల్ని తీర్చుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలు కుల, మత, వర్గ, పార్టీ భేదాలు లేకుండా అందజేస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి పథకంతో మత్స్యకారుల పిల్లలు స్కూళ్లకు వెళ్లి చదువుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్, స్థానిక నాయకులు అట్లూరి సంజయ్, కోయ అయ్యన్న, కురెళ్ళ పోలు, కవిటం సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, తవిటినాయుడు, రామిశెట్టి సూరిబాబు, దాసరి వెంకటేష్, తమ్ము అంజిబాబు, ప్రభుదాసు, మద్దా సుధాకర్, వాటాల నాగరాజు, వెంకటేశ్వరరావు, గాడి అర్జున్‌రావు, కొలాలటి ధనపేతురు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



గరగపర్రులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పాలకోడేరు: మండలంలో దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో 11 వేల 500 ఎకరాల్లో వరి సాగు చేశారు.ఇందులో 90 శాతం 1121 రకం సాగు చేశారు. ప్రస్తుతం ముందస్తు నాట్లు వేసిన గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి రైతు భరోసా కేంద్రాల పరిధి లో దాళ్వా కోతలు పూర్తి అయ్యాయి. ఎకరాకు 52 బస్తాలు దిగుబడి నమోదు అయ్యాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు 2లక్షల సంచులు కూడా సన్నద్ధం చేశారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు గరగపర్రు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరగపర్రు కేంద్రంలో 6,500 సంచులు అందుబాటులో ఉంచామన్నారు. ఈయన వెంట మండల వ్యవసాయ అధికారి వి నారాయణరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వరూప, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు చింతలపాటి సూర్యనారాయణ రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు



ఎన్నికల పీవో, ఏపీవోలకు అవగాహన కల్పిస్తున్న ఆర్వో నారాయణరెడ్డి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించనున్న సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాలకొల్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) బీఎస్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో మొత్తం 492 మంది పీఓ, ఏపీవోలు పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 10న 246 మందికి శిక్షణ ఇవ్వగా మిగిలిన సభ్యులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్ఎంటీ)లు 10 మంది పాల్గొన్నారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. తహసీల్దార్ పి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విస్సాకోడేరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం విస్సాకోడేరు 2 సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం లో 348 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి చినమిల్లి రంగమనాయుడు, డాక్టర్ హరిత వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రంగమనాయుడు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 40ఏళ్లు దాటిన వారంతా బీపీ సుగర్ పరీక్షలు చేయించుకోవాలని వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఏమైనా దీర్ఘకాలిక రోగాలు ఉన్నట్లయితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సిహెచ్‌ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వైఎస్ఆర్ గోపాలకృష్ణ, హెచ్ వీలు, ఎం.ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



పీఓ, ఏపీఓల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్‌ఆదిత్య

ఉండి: అధికారులంతా బాగా శిక్షణ పొంది ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉంటే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. శుక్రవారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తలెత్తే సమస్యలను సానుకూలంగా పరిష్కారించాలంటే పీఓలు, ఏపీఓలు అన్ని విషయాలను తెలుసుకోవాలన్నారు. అందుకు ఈ శిక్షణాకార్యక్రమం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ మాస్టర్ ట్రైనర్స్ ద్వారా తెలియచేసే విషయాలను జాగ్రత్తగా నేర్చుకోవాలని సూచించారు. ఎన్నికలు అతి సున్నితమైన కార్యక్రమం అని జాగ్రత్తగా నిర్వహిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే శిక్షణకు గైర్హాజరైన పీఓ, ఏపీఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు, ఎంపీడీలోలు, సెక్టారల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భారత రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు సైతం తెలియచేజేయాలనే లక్ష్యంతో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా స్కూల్స్, కళాశాలలస్థాయిల్లో భారత రాజ్యంగ విశిష్టత అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. వీరయ్య చెప్పారు. శుక్రవారం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డా.బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పేదలందరికీ ఆదర్శమనీ ప్రధానంగా పేద విద్యార్థులు అంబేడ్కర్ చరిత్ర నుంచి ఎంతో నేర్చుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ కార్యదర్శి వి సువర్ణ రాజు, ఉపాధ్యక్షుడు పి అమూల్యారావు, సెక్రెటరీ ఎస్ విజయకుమార్, చెరుకువాడ రంగసాయి, పి రాజబాబు, ఎంవీఎస్ ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని డి1 విద్యుత్ ఉపకేంద్రం వార్షిక నిర్వహణ పనులు కారణంగా ఈనెల 14వ తేదిన ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఏరియా, బొక్కవారిపాలెం, మల్లె తోట, చిన్నరంగనిపాలెం, హౌసింగ్ బోర్డ్ ఏరియా, పీపీ రోడ్డు, ఇండస్ట్రియల్ ఏరియా, నరసయ్య అగ్రహారం, పార్క్ స్ట్రీట్ ఏరియా, వేంద్ర కెనాల్‌రోడ్, రామచంద్రపురం, కోడవల్లి రోడ్డు, సబ్ రిజిస్టర్ ఆఫీస్, మారుతీ నగర్, ప్రకృతి ఆశ్రమం, సంజన అపార్ట్‌మెంట్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని అహ్మద్‌ఖాన్ కోరారు.

ఉండి:కోలమూరు 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పాక్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాధారణ వినియోగదారులు, ఆక్వా రైతులు గమనించి దయచేసి సహకరించాలని ఆయన కోరారు.

పాలకోడేరు: గొల్లలకోడేరు సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కె.వి విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు కావున గొల్లకోడేరు, గరగపర్రు, యండగండి, మైప గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

నేడు శివాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

పోడూరు: వేడంగిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 8.34 గంటలకు నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన చేయనున్నట్లు హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఇనుకొండ రంగారావు తెలిపారు. ఆలయం వద్ద నిర్వహించనున్న నవగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు, అన్న సమారాధనలో గ్రామానికి చెందిన భక్తులంతా పాల్గొనాలని అధ్యక్ష, కార్యదర్శులు రంగరావు, కొండేటి సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి బొలిశెట్టి విశ్వేశ్వరరావు కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిన్న దోమతో పెద్ద ప్రమాదం ఉందని దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను ప్రజల భాగస్వామ్యంతో అరికడదామని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న ఫీవర్ సర్వేలు, హెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలపై హెల్త్ సిబ్బందిచే శుక్రవారం అవగాహన ర్యాలీలు 33, 34, 35 వార్డుల్లో జరిగాయి. ప్రజారోగ్య పరిరక్షణ, దోమ లార్వాలను అరికట్టేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని, జ్వర లక్షణాలు ఉన్నవారు తప్పక ఆరోగ్య కార్యకర్తల దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రి అందుబాటులో ఉన్నాయని, అనారోగ్య సమస్యలు వచ్చిన సమయంలో వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు చినపాప, రాజేశ్వరీ, జ్యోతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94 శాతం ఉత్తీర్ణత

ఉండి: మండలంలోని యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు 94 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ రామప్రియ తెలిపారు.శుక్రవారం వెలువడిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కళాశాల నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 20 మంది హాజరుకాగా వారిలో 15 మంది ఉత్తీర్ణులైయ్యారు.సెకండియర్‌లో 17 మంది హాజరుకాగా 16 మంది ఉత్తీర్ణులైయ్యారు. ఒకేషనల్ కోర్సు ఫస్ట్ ఇయర్ 15 మంది పరీక్షకు హాజరుకాగా 11 మంది, సెకండియర్‌లో 15 మంది హాజరు కాగా 12 మంది ఉత్తీర్ణులైయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కాళ్లకూరులో చలివేంద్రం ఏర్పాటు

కాళ్ల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. కాళ్లకూరు గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి కాలం పూర్తయ్యే వరకూ మజ్జిగ చలివేంద్రాన్ని అందిస్తున్నట్లు అయన తెలిపారు. ఏటా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ ఏడాదీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, గాదిరాజు వెంకట సుబ్బారాజు ,అడ్డాల నాగరాజు, నంబూరి దుర్గరాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, మంతెన శ్రీ వెంకటరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడకు గాయాలు



దూడకు చికిత్స చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్డులో ఆవుదూడను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కాలు విరిగిందని ఏడీఏ కె.జనార్థనరావు శుక్రవారం చెప్పారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం డీసీసీబీ బ్యాంక్ ప్రక్కన పడి ఉన్న ఆవుదూడ కాలు విరిగిన ప్రాంతం దుర్వాసన వస్తుందని తెలిపారు. విరిగిన కాలుకు కర్రలతో కట్టుకట్టి, యాంటీబయాటిక్ మందులు వాడి, సిలైన్ ఎక్కించినట్లు చెప్పారు. కొంత మంది వ్యక్తులు ఆవు పాలు తీసుకుని వాటిని రోడ్డుపైకి వదిలివేయడంతో ప్రమాదాలకు గురవుతున్నాయని చెప్పారు.

బలుసులమ్మకు కుంభ నివేదన



అమ్మవారి ఆలయంలో కుంభ నివేదన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఉగాది సందర్భంగా శుక్రవారం బలుసులమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారికి భక్తులచే కుంభ నివేదన అత్యంత వైభవంగా సమర్పించారు. భక్తులు వండినటువంటి పిండి వంటలు, బూరెలు, పాయసం, స్వీట్లు అమ్మవారికి సమర్పించారు. తొలుత ఆలయంలో విశేష పూజలు జరిగాయి. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించారు. అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో మంగళ వాయిద్యాలతో సాయంత్రం నవహారతులు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవి కన్యకపరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో చైత్ర శుద్ధ చవితి పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీగణపతి స్వామి మూల విరాట్‌కు పంచామృతాలు, ఫలరసాలు, సుగంధద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిగాయి. స్వామి వారికి విశేష అలంకరణ గావించారు. ఆర్య వైశ్య సంఘం కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలపాటి సత్యనారాయణ, కృష్ణకుమార్‌లు పర్యవేక్షించారు.